# మూడ్రోజులుగా ముసురు

- రోడ్లపై భారీగా వర్షం నీరు
- హైదరాబాద్‌లో భారీగా ట్రాఫిక్ జామ్
- లోతట్టు ప్రాంతాలు జలమయం.. చిత్తడిగా రోడ్లు
- నిండుకుండల్లా రిజర్వాయర్లు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా గత మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలు గ్రామాల రోడ్లు, గ్రామాలన్నీ చిత్తడిగా మారాయి. పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురికి కాలువలు, డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారాయి. హైదరాబాద్‌లో బుధవారం రాత్రి నుంచి ముసురు పట్టింది. గురువారం సాయంత్రానికి కుంభవృష్టిని తలపించింది. రహదారులన్నీ జలమయమయ్యి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్‌బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్‌నగర్, నారాయణగూడ, లక్డీకాపుల్, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, మియాపూర్, మాదాపూర్, టీహబ్, నాలెడ్జ్ సిటీ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు నిలిచి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. నిజామాబాద్ జిల్లా రామారెడ్డి మండలంలో కురిసిన వర్షానికి వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల ఇండ్లు కూలిపోవడంతో అధికారులు పరిశీలించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, గంగారం మండలాల్లోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు నిండి అలుగుపారుతున్నాయి. పాకాల సరస్సుకు వరద నీరంతా చేరడంతో నిండుకుండలా మారింది. హనుమకొండ జిల్లా పరకాలలో చలివాగు అలుగుపోస్తుంది. పంటపొలాలు నీట మునిగాయి. చత్తీస్‌గఢ్, ఒడిశాతో పాటు తెలంగాణలోనూ కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్లలోకి వరదనీరు చేసి జలకళను సంతరించుకున్నాయి. కాగా, మరో రెండు రోజులపాటు వర్షాలు ఉండటంతో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

భారీ వర్షాలతో ఖమ్మంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు

### భద్రాచలం వద్ద 22 అడుగులకు చేరుకున్న గోదావరి

ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో భద్రాచలం వద్ద గోదావరి క్రమక్రమంగా పెరుగుతూ గురువారం సాయంత్రానికి 22 అడుగులకు చేరుకుంది. గత వారమే భద్రాచలం వద్ద గోదావరి 43 అడుగులకు చేరుకోగా మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన విషయం తెలిసిందే. అనంతరం క్రమంగా తగ్గిన గోదావరి మళ్లీ ఉగ్రరూపాన్ని దాల్చుతోంది. భద్రాచలం వద్ద గోదావరి క్రమక్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు రామాలయం వద్ద ఉన్న ప్రధాన స్లూఈజ్‌ను పరిశీలించారు. అధికారులు లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తూ ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. జాలర్లు చేపల వేటకు వెళ్లొద్దని, యాత్రికులు స్నానాల ఘాటు వద్దకు రాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. మరోపక్క తాలిపేరు ప్రాజెక్టు సైతం నిండుకుండలా మారడంతో నీళ్లను దిగువకు విడుదల చేస్తున్నారు. పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టులోకీ వరద వచ్చి చేరడంతో భద్రాచలం వద్ద మరో రెండు రోజులపాటు గోదారి పెరిగే అవకాశం ఉందని జల వనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

### ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు

ఖమ్మం నగరంలో మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారం సాయంత్రం నాటికి 9 అడుగుల వద్ద వరద ప్రవాహం కొనసాగుతోంది. ఖమ్మం కాలువొడ్డు- నాయుడుపేట మధ్య తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చప్టాపై నుంచి నీరు ప్రవహిస్తోంది. వరదను అధికారులు ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. వరద ఉధృతిని ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి వద్ద నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.

### నిండుకుండలా ప్రాజెక్టులు

ఎగువన, తెలంగాణలోనూ కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్లు నిండుకుండను తలపిస్తున్నాయి. నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే మరో మూడు రోజుల్లో సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంటుంది. నాగార్జున సాగర్ జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, గురువారం రాత్రికి 577 అడుగులకు చేరుకుంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 1,21,400 క్యూసెక్కుల నీరు వస్తుండగా సాగర్ కుడికాలువ ద్వారా 511 క్యూసెక్కులు, ఎడుమ కాలువ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 3972 క్యూసెక్కులు, ఎస్ఎల్బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు మొత్తంగా 6283 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి 1,01,785 క్యూసెక్కుల మీరు వస్తుండగా శ్రీశైలం డ్యామ్ రెండు గేట్లను 10 అడుగుల మేరకు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే, జూరాలకు ఎగువ ప్రాంతం నుంచి వరద తగ్గడంతో గేట్లను మూసివేశారు. జూరాల సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా 8.9 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో 57 వేల క్యూసెక్కులు వస్తుండగా విద్యుత్ కోసం 38,803 క్యూసెక్కులు కిందికి వదులుతున్నారు. నెట్టెంపాడుకు 750, బీమాకు 650, కోయిల్‌సాగర్‌కు 315, కుడి కాలువకు 820, ఎడమ కాలువకు 550 క్యూసెక్కులు మొత్తం 42134 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.

## సహాయక చర్యలు చేపట్టండి
## కలెక్టర్లకు రేవంత్‌రెడ్డి ఆదేశం

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన గురవారం సిఎంఒ అధికారులతో మాట్లాడి తగు సూచనలు చేశారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో విపత్తు నివారణ బృందాలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వరద నీటి ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. భారీ వర్ష సూచన ఉన్న జిల్లాల్లో కలెక్టర్లు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు. వర్షాలు, వరదలతో ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు, అధికారులు జిల్లాల్లోనే అందుబాటులో ఉండాలన్నారు. ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్లతోమాట్లాడిపరిస్థితిని సమీక్షించాలని సూచించారు.

సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న కోట రమేష్

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- విద్య, ఉపాధి హక్కుల కోసం పోరాడాలి
- డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సమాజంలో డ్రగ్స్, గంజాయి మాదకద్రవ్యాలు, మద్యపానం వల్ల యువత చెడు వ్యసనాల బారినపడి విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ అన్నారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలన, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు రద్దు చేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ చైతన్య సైకిల్ యాత్రను గురువారం నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణ కేంద్రంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ డ్రగ్స్, గంజాయి యువతను చెడు మార్గంలో పట్టిస్తున్నాయన్నారు. డ్రగ్స్, గంజాయి బారిన పడుతున్న యువత సామాజిక బాధ్యతలు మరిచి అనేక అఘాయిత్యాలకు పాల్పడుతూ తమ ప్రాణం కూడా పోగొట్టుకుంటోందని చెప్పారు. పాలక ప్రభుత్వాలు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించనందునే ఇలాంటివి జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువతను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకుంటోందని విమర్శించారు. యువత చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సామాజిక చైతన్యంతో సమాజ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. విద్య, ఉపాధి, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాల్లోకి రావాలని కోరారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువచైతన్య సైకిల్ యాత్ర రథసారథి మల్లం మహేష్ మాట్లాడుతూ.. ఈ సైకిల్ యాత్ర నకిరేకల్, మునుగోడు, దేవరకొండ, సాగర్, నల్లగొండ నియోజకవర్గాల మీదుగా సాగుతూ ఆగస్టు 2న మిర్యాలగూడ నియోజకవర్గ కేంద్రంలో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ వరంగల్ జిల్లా కార్యదర్శి రావుల రాజు, జిల్లా అధ్యక్షులు రవి నాయక్, నాయకులు పుల్లెంల శ్రీకర్, పతాని శ్రీను, వడ్డగాని మహేష్, గద్దపాటి సుధాకర్, గుండాల నరేష్, కట్ట లింగస్వామి, వివిధ ప్రజా సంఘాల నాయకులు రాచకొండ వెంకన్న, ఒంటెపాక వెంకటేశ్వర్లు, లకపాక రాజు, దాసరి శంకర్ పాల్గొన్నారు.

## నేటినుంచి దోస్త్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్

- రిజిస్ట్రేషన్‌కు గడువు 31
- ఆగస్టు 3న సీట్ల కేటాయింపు
- 11,12 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో బిఎ, బిఎస్‌సి, బికాం, బికాం ఒకేషనల్, బికాం ఆనర్స్, బిఎస్‌డబ్ల్యు, బిబిఎ, బిసిఎ, బిబిఎం, బిసిఎ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభం కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ వి బాలకిష్టారెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. దోస్త్ ప్రత్యేక విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ శుక్రవారం నుంచి ఈ నెల 31 వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశముందని తెలిపారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.400 చెల్లించాలని కోరారు. శుక్రవారం నుంచి ఈ నెల 31 వరకు విద్యార్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 31న విశ్వవిద్యాలయాల్లోని హెల్ప్‌లైన్ కేంద్రాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. వచ్చేనెల మూడో తేదీన దోస్త్ ప్రత్యేక విడత సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. అదేనెల మూడు నుంచి ఆరు వరకు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. వచ్చేనెల నాలుగు నుంచి ఆరు వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. అదేనెల 11, 12 తేదీల్లో ప్రయివేటు, ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లను నిర్వహించాలని తెలిపారు. స్థానికులు, స్థానికేతరులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లలో సీట్లు పొందిన విద్యార్థులు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు కాదని స్పష్టం చేశారు. ఇతర వివరాల కోసం https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

## నేటి నుంచి ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్

- రేపు ధ్రువపత్రాల పరిశీలన

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ప్రాసెసింగ్ ఫీజు చెల్లించడానికి అవకాశముందనీ, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 26న ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 26,27 తేదీల్లో వెబ్‌ఆప్షన్ల నమోదు చేసేందుకు అవకాశముందని వివరించారు. ఈనెల 30న ఎప్‌సెట్ రెండోవిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. రాష్ట్రంలో 172 ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 83,054 సీట్లున్నాయి. ఎప్‌సెట్ మొదటి విడతలో 77,561 మందికి సీట్లు కేటాయించారు. అందులో 59,980 మంది సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. ఎప్‌సెట్ రెండో విడతలో 23,074 సీట్లు అభ్యర్థులకు అందుబాటులో ఉన్నాయి.

## నీటిపారుదల శాఖలో ఉద్యోగోన్నతులు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖలో ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించారు. దాదాపు 18 ఏళ్ల నిరీక్షణ అనంతరం 127 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు తొలిసారి ప్రమోషన్లను కల్పిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీచేసింది. ఈనేపథ్యంలో గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఇంజనీర్లంతా శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంజనీరింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బండి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి నాగరాజు, కోశాధికారి సంతోషరెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం మంత్రికి కృతజ్ఞతలు తెలిపినవారిలో ఉన్నారు.

## వచ్చే నెల 2 న పిజిటిఎయు 55వ స్నాతకోత్సవం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఆగష్టు రెండున ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎయు) 55వ స్నాతకోత్సవాన్ని రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ డాక్టర్ సిహెచ్ విద్యాసాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 519 మంది యుజి, పిజి, పిహెచ్‌డి విద్యార్థులు అందుకోనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసిఎఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఎల్ జాట్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ అధ్యక్షతన ఈ స్నాతకోత్సవం జరగనుందని పేర్కొన్నారు. స్నాతకోత్సవంలో 322 మంది మహిళలు, 197 మంది పురుషులు పట్టాలు అందుకోనున్నారనీ, వారిలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన తొమ్మిది మంది పిజి, పిహెచ్‌డి విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనున్నట్టు తెలిపారు. ఇద్దరు పిజి, పిహెచ్‌డి విద్యార్థులకు రూ. 25 వేల చొప్పున నగదు బహుమతిని అందజేయనున్నామని పేర్కొన్నారు.

## మేక్‌మైట్రిప్ గ్లోబల్ టూర్స్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం

**హైదరాబాద్ :** ఆన్‌లైన్ ట్రావెల్ బ్రాండ్ మేక్‌మైట్రిప్ భారతీయ ప్రయాణికుల కోసం గ్లోబల్ టూర్స్ అండ్ అట్రాక్షన్స్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. ఈ ప్లాట్‌ఫామ్ 130 దేశాల్లోని 1,100 నగరాల్లో 2 లక్షలకు పైగా కార్యకలాపాలను అందిస్తుందని పేర్కొంది. సాంస్కృతిక టూర్లు, థీమ్ పార్కులు, అడ్వెంచర్ యాక్టివిటీలతో సహా. ఇది భారతీయ ప్రయాణికులకు సులభమైన బుకింగ్, భారత ధరలు, ఇంటిగ్రేటెడ్ ఇంటర్‌ఫేస్‌తో గందరగోళాన్ని తగ్గిస్తుందని మేక్‌మైట్రిప్ గ్రూప్ సిఇఒ రాజేష్ మాగోవ్ తెలిపారు. 'ఈ ప్లాట్‌ఫామ్ భారతీయులకు ప్రపంచ అనుభవాలను సులభతరం చేస్తుందన్నారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ఆగస్టు 5

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

దూరవిద్య పదో తరగతి, ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఫీజు చెల్లింపు ప్రక్రియ ఈనెల 28 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) డైరెక్టర్ పివి శ్రీహరి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్య రుసుం లేకుండా ఫీజు చెల్లింపునకు గడువు వచ్చేనెల ఐదో తేదీ వరకు ఉందని తెలిపారు. ఆలస్య రుసుం రూ.25తో వచ్చేనెల ఆరు నుంచి పది వరకు, రూ.50తో అదేనెల 11 నుంచి 15 వరకు, తత్కాల్ పద్ధతిలో అదేనెల 16 నుంచి 18 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశముందని వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 22 నుంచి 29 వరకు దూరవిద్య పదో తరగతి, ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. టీజీ ఆన్‌లైన్ లేదా మీసేవ కేంద్రాల్లో పరీక్ష ఫీజును చెల్లించాలని సూచించారు. ఇతర వివరాలకు http://www.telanganaopenschool.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

# ఆర్ఎస్ఎస్ మత రాజకీయాలు ప్రమాదకరం

- బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రక్షాళన వెనుక కుట్ర
- రాష్ట్రంలో టికెట్ సినిమా చూపిస్తున్న కాంగ్రెస్ : తమ్మినేని

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో ఆర్ఎస్ఎస్ మతతత్వ సిద్ధాంతాలను అమలు చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని వీరభద్రం అన్నారు. దేశంలో మతతత్వ రాజకీయాలతో బిజెపి పౌరుల హక్కులను కాలరాసేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్టార్ బాంకెట్ హాల్‌లో జరుగుతున్న కెవిపిఎస్ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి హాజరైన తమ్మినేని అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గతంలో పౌరసత్వ చట్టం మార్పుల పేరుతో మైనార్టీలను దేశం నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేసిందని, తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ ప్రయత్నాన్ని ఆపిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో మరోసారి కుట్రకు పాల్పడుతోందని, బీహార్‌లో జరుగుతున్న ఈ కుట్ర రేపు దేశం మొత్తం వ్యాపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ పారదర్శకతపై పార్లమెంటులో చర్చ జరపాలని డిమాండ్ చేశారు. 'ఆపరేషన్ సింధూర్' పేరుతో హిందూ, ముస్లింల మధ్య తగాదాలు పెంచుతోందన్నారు. ముస్లింలను బిసి లెక్కల్లో చేర్చారని రాష్ట్రంలో 42 శాతం బిసి బిల్లు అమలును ఒకపక్క వ్యతిరేకిస్తూనే.. మరోపక్క బీహార్ ఎన్నికల్లో లబ్ధి కోసమే దేశవ్యాప్త బిసి జనగణనకు బిజెపి అంగీకరించిందని విమర్శించారు. అంబేద్కర్ రాజ్యాంగంతో ప్రస్తుతం బడుగులకు కలుగుతున్న కొద్దిపాటి ప్రయోజనం కూడా అందకుండా చేయాలని రిజర్వేషన్లపై సమీక్ష జరపాలంటోందని చెప్పారు. బిజెపి సిద్ధాంతాలతో బడుగులకు ఉద్యోగ, ఆర్థిక ప్రయోజనాలు దూరమయ్యే ప్రమాదం ఏర్పడనుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సిఎం రేవంత్‌రెడ్డి డబ్బులు లేవంటున్నారని విమర్శించారు. డబ్బులు లేవని ముందే తెలిసినా ఎందుకు హామీలిచ్చారని ప్రశ్నించారు. హామీల అమలును తప్పించుకునేందుకు కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా కార్ రేస్ అంటూ రోజుకో టికెట్ లేని సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను వదిలిపెట్టి ఫోన్ ట్యాపింగ్ పేరుతో కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయని అన్నారు. దేశద్రోహుల కోసం చేయాల్సిన ఫోన్ ట్యాపింగ్‌ను ప్రతిపక్షాలు, అసమ్మతి వాదులపై ప్రయోగిస్తున్నారని అన్నారు. రాబోయే కాలంలో బడుగుల హక్కుల సాధనకు, అభ్యున్నతికి సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, జిల్లా కార్యదర్శి కోట గోపి, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ పాలడుగు నాగార్జున ఉన్నారు.

# గ్రామాల్లో రహదారులను పూర్తి స్థాయిల్లో నిర్మిస్తాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ బ్యూరో :** గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం రహదారుల నిర్మాణాలన్ని పూర్తి చేస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించి పలు రహదారుల నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. గోళ్లపాడు నుంచి రామన్నపేట వరకు రూ.3.52 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, పల్లెగూడెం-మంగళగూడెం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఊటవాగు తండా వరకు రూ.75 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పున్ణనిర్మాణం పనులను ప్రారంభించారు. అలాగే, మంగళగూడెం నుంచి సర్వే నెం.272 వరకు రూ.165 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్ నిర్మాణం, కొత్తూరు నుంచి లకావత్ తండా వరకు రూ.2.20 కోట్లతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలేరు నియోజకవర్గంలో బురద లేని అంతర్గత రోడ్లు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కల్పిస్తామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కండ్లుగా కొనసాగిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. రూ.22,500 కోట్లతో ప్రభుత్వం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడతలో మంజూరు చేశామన్నారు. ఎన్నో కార్యక్రమాలు అమలుచేసి, అర్హులకు అందజేస్తున్నామని, ఇంకా ఎంతో చేయాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల, అభివృద్ధి సంస్థ చైర్మెన్ మువ్వా విజయ్‌బాబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ, డిఇ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ మండలం తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

## ఒక సంక్షేమ పథకం..అనేక విప్లవాత్మక మార్పులకు కారణం

**హైదరాబాద్ బ్యూరో :** ఒక సంక్షేమ పథకం అనేక విప్లవాత్మక మార్పులకు కారణమైనదంటూ ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంపై సిఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ట్వీట్ చేశారు. "'కొందరు ఎగతాళి చేసినా ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణ పథకం ఆడబిడ్డలకు ఆర్థిక భారం తగ్గించి, ఆరోగ్య రక్షణకు ఆసరాగా నిలిచి ఆనందకర జీవితానికి ఆలంబన అయ్యింది. ఆ ఒక్క పథకం వల్ల ఆర్‌టిసిలో ఆడబిడ్డల ఆక్యుపెన్సీ 35 నుంచి 60 శాతానికి పెరిగిందనీ, పేద ఆడబిడ్డలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల చికిత్స కోసం ఆస్పత్రులకు వెళ్లే సంఖ్య 31 శాతానికి పెరిగిందని, ఆర్‌టిసి సంస్థ గట్టెక్కిందని ఆర్‌టిసిలో పనిచేస్తున్న చెల్లెమ్మలు చెప్పిన వివరాలు నాకు ఎనలేని సంతోషానిచ్చాయి. ప్రజా పాలన ప్రారంభమయ్యే నాటికి ఇక ఆర్‌టిసి కథ కంచికే అన్న పరిస్థితి. పేదవాడి ప్రగతి రథ చక్రం ఇక చరిత్ర పుటల్లోకి జారి పోతుందనే పరిస్థితి. అక్కడ నుండి మొదలైన ప్రయాణం నేడు 200 కోట్ల జీరో టికెట్లతో ఆడబిడ్డలకు సాయం చేసి ఆర్‌టిసికి ప్రాణం పోసిన ప్రతి ఉద్యోగి, సిబ్బంది, కార్మికులకు నా శుభాకాంక్షలు. సంస్థ యాజమాన్యానికీ, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నా ప్రత్యేక అభినందనలు. ఇదే స్ఫూర్తిని ఇక పై కూడా మీరంతా కొనసాగిస్తారని ఆశిస్తున్నాను.' అని సిఎం ట్వీట్‌లో పేర్కొన్నారు.

# సీడ్ పత్తి పంటను మొత్తం కొనాలి

- రైతులకు పెట్టుబడి సాయం ఎకరాకు రూ.లక్ష ఇవ్వాలి : సాగర్



అధికారులకు వినతపత్రం అందజేస్తున్న సాగర్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

గద్వాలలో సాగు చేసిన సీడ్ పత్తి పంటను మొత్తం కంపెనీలు, ఆర్గనైజర్లు కొనుగోలు చేసి పెట్టుబడి సాయం ఎకరాకు రూ.లక్ష ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ అడిషనల్ కమిషనర్ విజయ్ కుమార్‌ను, విత్తన పర్యవేక్షణ అధికారి నరసింహారావును కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. నడిగడ్డ ప్రాంతమైన జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రతి ఏటా 25 వేల మంది రైతులు 40 వేల ఎకరాల్లో సీడ్ పత్తి సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రధానంగా 25 కంపెనీలు ఆర్గనైజర్ల ద్వారా విత్తనాలు రైతులతో నాటిస్తున్నారన్నారు. పండించిన పంట మొత్తం కొనుగోలు చేసేవారని, ఈసారి ఎకరాకు రెండు క్వింటాళ్ల పంట మాత్రమే కొనుగోలు చేస్తామని కంపెనీలు, ఆర్గనైజర్లు చెప్పడం అన్యాయమన్నారు. ఈ నెల 17న రైతులు పెద్దఎతున కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేసిన విషయం తెలిసిందే అన్నారు. దానికి కలెక్టర్, ఎస్పీ స్పందించి.. కంపెనీలు, ఆర్గనైజర్స్‌తో చర్చలు జరిపి పంట మొత్తం చేయిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సీడ్ పత్తి పంటను మొత్తం కొనుగోలు చేయడంతోపాటు ఎకరాకు పెట్టుబడి సాయం కింద రూ.లక్ష రైతులకు చెల్లించే విధంగా కంపెనీలు, ఆర్గనైజర్స్‌పై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. లేకుంటే రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శోభన్ నాయక్, జిల్లా కార్యదర్శి సంకాపురం మల్లేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.వెంకటస్వామి, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్, రైతు సంఘం నాయకులు వీవీ నరసింహ, వీరేష్, ఉరుకుందు, నారాయణ, తిమ్మప్ప పాల్గొన్నారు.

## వర్షాల నేపథ్యంలో ఆర్అండ్‌బి అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కేంద్రాల్లో ఉంటూ పర్యవేక్షణ చేయాలి
- అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి
- అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా గత రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారులు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సూపరిండెంట్ ఇంజనీర్లు జిల్లా కేంద్రాల్లో అందుబాటులో ఉంటూ క్షేత్ర స్థాయిలో ఇఇ, డిఇ, ఎఇలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రతి నాలుగైదు గంటలకు ఒకసారి ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులపై సమీక్ష చేయాలని చెప్పారు. హైదరాబాద్ నుంచి ఇఎన్‌సి, సిఇలు పర్యవేక్షణ చేస్తూ తనకు సమాచారం ఇవ్వాలన్నారు. కల్వర్టులు, బ్రిడ్జీలు నిర్మాణంలో ఉన్న రోడ్ల వద్ద రెగ్యులర్ చెకప్ చేయాలని, పొంగిపొర్లే వాగులపై ఉన్న బ్రిడ్జీలను తరచూ పరిశీలించాలని సూచించారు. వరదలతో కోతకు గురైన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన వెంటనే పునరుద్ధరించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. విద్యుత్, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, పంచాయతీరాజ్ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే పరిష్కరించాలని ఆదేశించారు. బలమైన ఈదురు గాలులతో వచ్చే వానలమూలంగా రోడ్లను అనుకోని ఉన్న విద్యుత్ స్థంబాలు, రోడ్ల మీదుగా వెళ్లే హైటెన్షన్ వైర్లతోనూ ప్రమాదం ఏర్పడే ఆస్కారం ఉందన్నారు. ఎక్కడైనా అట్లాంటివి ఉంటే ముందుగానే గుర్తించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. నదులు, వాగుల వెంట, చెరువు కట్టల కింద ఉన్న రోడ్లు ఊహించని భారీ వరద ప్రవాహానికి దెబ్బతినే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇరిగేషన్ అధికారులతో టచ్‌లో ఉంటూ వరద ప్రవాహాన్ని అంచనా వేస్తూ, రోడ్లపై రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. అలాగే రోడ్లపై ప్రయాణించే వారిని అప్రమత్తం చేయాలన్నారు. పోలీస్ యంత్రాంగం సహకారంతో ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలనీ, అత్యవసరమైతే ప్రజలు రోడ్ల పైకి రావాలని కోరారు. వరదలకు రోడ్డు పాలైతే ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా తిరిగి వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఆర్ అండ్ బీ అధికారి క్షేత్రస్థాయిలో కచ్చితంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్పా సెలవుపై వెళ్లొద్దని మంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

**నోటీసు**

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు,అద్దంకి

**E.A.No: 116/2024**
**IN**
**E.A. No: 602/2019**
**IN**
**E.P.No: 64/2010**
**IN**
**O.S.No: 199/1984**

Between :
రావిపాటి సుబ్బారావు( డైడ్) మరియు 4గురు
...డిగ్రీ హోల్డర్స్ /పిటిషనర్
మరియు
పోతేపల్లి నాగభూషణం (డైడ్) మరియు 19 మంది
...ప్రతివాదులు/ జెడిఆర్స్

**7వ రెస్పాండెంట్ జె.డి.ఆర్**
కనపర్తి నాగదాక్షాయిని
భర్త ప్రభాకర్ విశ్వనాథ చారి,
సఫిల్ గూడ, సీతారామ నగర్ హైదరాబాద్

పైనంబరు డిక్రీ హోల్డర్ మీ వగైరాలపై పొందబడిన డిక్రీఅమలు నిమిత్తం E.P వేసి యున్నాము. E.P అమలులో ఉండగా డిక్రీ హోల్డర్ రావిపాటి సుబ్బారావు చనిపోయినందున పై E.P ఎల్.ఆర్ పిటిషన్ లో వారి వారసులను చేర్చుటకు దాఖలు చేసియున్నాము. పిటిషను నోటీసులు ఎన్ని సార్లు పంపిన అందనందున 31-07-2025 తేదీన నోటీసులు నిమిత్తం కోర్టువారు వాయిదా వేసి యున్నారు. మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 నిమష ములకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించవలసినది. ఇందుమూలముగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి అనుమతితో //

అద్దంకి — కాకాని లక్ష్మీ నాగేశ్వరమ్మ
తేది : 24-07-2025 — ఎం.ఏ,ఎల్.ఎల్.బి
డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్, అద్దంకి

## అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలి

- సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ అబివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలనీ, జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర సమాచార. పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సి.ప్రియాంక అన్నారు. గురువారం నాంపల్లి మీడియా అకాడమీలో రంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల శిక్షణ తరగతుల ముగింపులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ జర్నలిస్టుల ప్రయోజనం కోసం అవసరమైన సౌకర్యాలను అందించడంలో మీడియా అకాడమీ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. అకాడమీకి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. పాత రోజుల్లో వార్తలను అందించే పద్ధతి చాలా కష్టంగా ఉండేదనీ, కానీ ఇప్పుడు వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా వార్తల సమాచారం అందరికీ సెకన్లలో చేరుతుందని గుర్తుచేశారు. ఎప్పటికప్పుడు ప్రజల మధ్య జరిగే ప్రతి విషయాన్ని ప్రజలకు అందించడంలో జర్నలిస్టుల పాత్ర ముఖ్యమైనదన్నారు. ఈ సమాజంలో నిజాలను నిక్కచ్చింగా, నిజాయితీగా తెలియజేయాలన్నారు. అకాడమీ ద్వారా మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు పెన్షన్ అందించడం, వారికి సహాయం చేయడం వల్ల చాలా మంది పిల్లల చదువుకు గొప్ప ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుందన్నారు. వారికి సంబంధించిన బీమా పథకంలో ఉన్న లోపాలను సరిదిద్ది సక్రమంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. విధుల్లో ఉండి ప్రమాదాల్లో గాయపడి పని చేయలేని వారికి ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ప్రభుత్వం అనేక ఇతర సంక్షేమ పథకాలను అందిస్తున్నదనీ, ప్రభుత్వం తన శాఖ ద్వారా జర్నలిస్టులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తుందని అన్నారు. అనంతరం పలువురు జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు.

## జువైనల్ హోం నుంచి పారిపోయిన బాలురులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సైదాబాద్ పరిధిలోని జువైనల్ హోం నుంచి ఐదుగురు బాలురులు పరారయ్యారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకెళ్తే.. ఈ నెల 22న మంగళవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో జువైనల్ హోం నుంచి ఐదుగురు బాలురు గోడ దూకి తప్పించుకున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు హెూం అధికారులు సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పిల్లల కోసం గాలింపు చేపట్టారు. ఈ విషయంపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## స్పౌజ్, పరస్పర బదిలీలకు అనుమతి

- ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల స్పౌజ్, పరస్పర బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈ నవీన్ నికోలస్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కెజిబివి), అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (యూఆర్ఎస్)తోపాటు సమగ్ర శిక్షలో 2025-26 విద్యాసంవత్సరంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల స్పౌజ్, పరస్పర బదిలీలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. స్పౌజ్, పరస్పర బదిలీలకు అర్హులైన ఉద్యోగులకే బదిలీలుంటాయని స్పష్టం చేశారు. ఈనెల 26 నాటికి దరఖాస్తులను సమగ్ర శిక్ష కార్యాలయానికి సమర్పించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులు స్పౌజ్ లేదా పరస్పర బదిలీల్లో ఒక్క దానికే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల స్థానచలనానికి సంబంధించి చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులు (డిఇఓ), సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారుల (డిపిఓ)ను ఆదేశించారు. రాష్ట్రంలోని కేజీబీవీలు, యూఆర్ఎస్‌లతో పాటు సమగ్ర శిక్షలో పనిచేస్తున్న దంపతులు (స్పౌజ్), పరస్పర (మ్యూచువల్) బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలనీ, వారి వివరాలను ఈనెల 26లోగా ఎస్పీడీ కార్యాలయానికి పంపాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ ఉత్తర్వులిచ్చారని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ తెలిపారు.

# స్థానిక సమస్యలపై పోరాటాలు

- బిసి రిజర్వేషన్లపై పెదవి విప్పని మంత్రులు రాజీనామా చేయాలి:జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి పార్లమెంటులో చట్టం చేసే విషయంలో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పెదవి విప్పడం లేదని, వారు తమ పదవులకు రాజీనామా చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలకేంద్రంలో వీరపనేని రామదాసు, వెంకటసుబ్బమ్మ ఐదవ వర్ధంతి సందర్భంగా జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడారు.

సభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

కృష్ణా జిల్లాలోని గన్నవరంలో పుట్టి ఆ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకంగా పనిచేసి డివిజన్ కార్యదర్శిగా పనిచేసిన రామదాసు గోవిందరావుపేటకు తన స్థిర నివాసాన్ని మార్చుకొని స్థానికంగా పార్టీ నిర్మాణంలో కృషి చేశారన్నారు. ఆయన స్వాతంత్రోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లి అక్కడే కమ్యూనిస్టుగా మారి బయటకు వచ్చారని గుర్తుచేశారు. అప్పటినుంచి కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకంగా పనిచేశారని, అటువంటి నిబద్ధత కలిగిన రామదాసు స్ఫూర్తితో పార్టీని బలోపేతం చేయాలని తెలిపారు. బిజెపి దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య అసమానతలను సృష్టిస్తున్నదని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లౌకికవాదం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

**ఉపాధి హామీకి నిధులు పెంచాలి**

దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా పెరిగిపోతుందని, అక్కడ ప్రధాని మోడీ, ఇక్కడ సిఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దేశ బడ్జెట్‌లో ఉపాధి పథకానికి రూ. రెండు లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 కనీస వేతనం, ఏటా 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

వచ్చే రెండు నెలలు.. స్థానిక సమస్యలపై పోరాటాలు

రానున్న ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పార్టీ కార్యకర్తలంతా ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి పోరాటాలు చేయాలని జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాల ద్వారానే కమ్యూనిస్టులు ఎదుగుతారని, ఓట్లతో, సీట్లతో కాదని తెలిపారు.

**స్థానిక సంస్థలకు సిద్ధం**

స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. బలమున్న ప్రాంతాల్లో పోటీ చేసి గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు.

ములుగు జిల్లాలోని గోవిందరావుపేట, తాడ్వాయి, వాజేడు, వెంకటాపురంలోని నాలుగు జడ్‌పిటిసి స్థానాల్లో పోటీ చేయనున్నామని తెలిపారు. తొలుత గోవిందరావుపేట మండలకేంద్రంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రదర్శన నిర్వహించారు. వీరపనేని రామదాసు ఇంటి ముందు పతాకావిష్కరణ చేసి రామదాసుకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, రాష్ట్ర సీనియర్ నాయకులు డిజి నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మల వెంకట్‌రెడ్డి, పొదిళ్ల చిట్టిబాబు, ఎండి దావూద్, కొప్పుల రఘుపతి, ధ్యానం వాసు, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల పత్తి విత్తన రైతులకు న్యాయం చేయాలి

- వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్‌కు రైతు, గిరిజన సంఘాల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గద్వాల జిల్లాలో పత్తి విత్తనాలు సాగు చేస్తున్న రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, నాయకులు వెంకటస్వామి, నర్సింహ్మ, మల్లేష్, వీరేశ్, నారాయణ, తిమ్మప్ప, వీరన్న తదితరులు ఉన్నారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ సాగు చేస్తున్న 40 వేల ఎకరాల విత్తన రైతులు పండించిన పంటను కొనుగోలు చేసి రైతులకు ఎకరానికి ఇచ్చే పెట్టుబడి సహాయం లక్ష రూపాయలు కంపెనీల నుంచి ఇప్పించాలని డిమాండ్ చేశారు. 'గద్వాల జిల్లాలో రైతులు 25 ఏళ్ల నుంచి పత్తి విత్తన ఉత్పత్తి చేస్తున్నారు. 25 వేల మంది రైతులు 40 వేల ఎకరాలలో సాగు చేస్తున్నారు. సుమారు 16 కంపెనీలు (మధ్యవర్తులు) ఆర్గనైజర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాయి. ప్రతి సంవత్సరం బీటీ, నాన్ బీటీ విత్తనాలు ఆర్గనైజర్ ద్వారా రైతులకు ఇచ్చి ఎకరానికి లక్ష రూపాయలు పెట్టుబడి సాయం ఇస్తున్నారు. ఈ ఏడాది కూడా 40 వేల ఎకరాలకు విత్తనాలు ఇచ్చారు. రైతులు పంట సాగు చేశారు. కొనేటప్పుడు కంపెనీలు, ఆర్గనైజర్స్ ఎకరానికి రెండు క్వింటాళ్ళు మాత్రమే కొనుగోలు చేస్తాం. పెట్టుబడి సాయం ఇవ్వం' అంటున్నాయని చెప్పారు. దీనిపై సమగ్ర విచారణ చేసి రైతులు పండించిన మొత్తం పంటలు కంపెనీలు కొనుగోలు చేసి పెట్టుబడి సాయం కింద లక్ష రూపాయలు రైతులకు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

**డిమాండ్లు**

- రైతులు పండించిన పంటలు మొత్తం కొనుగోలు చేయాలి.
- ప్యాకెట్ ధర రూ.800 చెల్లించాలి.
- కంపెనీ, రైతుల మధ్య ఒప్పందం ఉండాలి.
- పంటలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి.
- ఎకరాకు వడ్డీలేని రుణాలు రూ. రెండు లక్షలు ఇవ్వాలి.
- జిన్నింగ్ ఖర్చులు కంపెనీలే భరించాలి.
- రైతులు పంట ఇచ్చిన వెంటనే డబ్బులు చెల్లించాలి.

## గురునానక్‌లో ఎస్ఎపి ఓరియెంటెడ్ బిటెక్ ప్రోగ్రామ్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

గురునానక్ యూనివర్సిటీ తన హైదరాబాద్ క్యాంపస్‌లో ఎస్ఎపి సమన్వయంతో రూపొందించిన ఎస్ఎపి ఓరియెంటెడ్ బిటెక్ ప్రోగ్రామ్‌ను అధికారికంగా ప్రారంభించినట్లు ఆ సంస్థ తెలిపింది. విద్యారంగం, పరిశ్రమల మధ్య ఉన్న అంతరాన్ని తీర్చే దిశగా ఇది ఒక చారిత్రక నిర్ణయమని ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ ప్రోగ్రామ్ విద్యార్థులకు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ నైపుణ్యాలను అందించేందుక రూపొందించబడిందన్నారు.

ఎస్ఎపి సర్టిఫైడ్ ట్రైనింగ్ భాగస్వాముల సహకారంతో రూపొందించిన ఈ కోర్సు ద్వారా విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఫార్చ్యూన్ 500 కంపెనీలు వినియోగించే ఎస్ఎపి మాడ్యూళ్లపై ప్రాక్టికల్ అనుభవాన్ని పొందగలుగుతారని ఆ సంస్థ తెలిపింది. ఇఆర్‌పి రంగంలో అవసరమైన ముందు వరుస (ఫ్రంట్-ఎండ్), వెనుక వ్యవస్థలు (బ్యాక్-ఎండ్) పరిజ్ఞానం ఈ కోర్సులో భాగంగా ఉంటాయని తెలిపింది.

# 'భద్రి'కి జాప్యం

- వరద ముంపు పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం
- ఏడాది గడిచినా పూర్తికాని పనులు
- బొందివాగు ఎంట్రీలో ఇన్‌ఫ్లో షట్టర్స్ ఏర్పాటులో ఆలస్యం
- అధ్యయనం చేస్తున్న 'నిట్' బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ వరంగల్‌లో వరద ముంపు నివారణ కోసం చేపట్టిన భద్రకాళి చెరువు పరిధిలో పనులను కాంట్రాక్టర్లు సకాలంలో పూర్తి చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. భద్రకాళి చెరువు పరిధిలో వరద నియంత్రణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించి టెండర్లు పిలిచింది. ఏడాదిలోగా ఈ పనులు పూర్తి చేస్తామని అధికారులు ప్రకటించారు. ఈ జులైతో పనుల పూర్తికోసం గుత్తేదారు చేసుకున్న అగ్రిమెంట్ పూర్తి కానుంది. రూ.150 కోట్లలో భద్రకాళి చెరువులోకి బొందివాగు కలిసే చోట ఇన్‌ఫ్లో షట్టర్స్, రైల్వే ట్రాక్ నుంచి భద్రి చెరువు వరకు రెండు వైపులా 30 మీటర్ల వెడల్పుతో రిటైనింగ్ వాల్స్ నిర్మాణం చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆ పనులు ప్రారంభించలేదు. భద్రకాళి చెరువులు రెండువైపులా మత్తడులున్నాయి. ఇందులో కాపువాడ వైపు మాత్రం 50 మీటర్ల నిడివితో నిర్మాణం చేసి తొమ్మిది గేట్లను బిగించే పనులు సాగుతున్నాయి. ఇందులోనూ కాంక్రీట్ పనులు 60-70 శాతం పూర్తయ్యాయి. రెండోవైపు పోతన్‌నగర్ వైపు ఉన్న మత్తడి నిర్మాణం పనులు నేటికీ ప్రారంభించలేదు.

**బలహీనమైన మృత్తికతో మల్లగుల్లాలు**

భద్రకాళి చెరువులోకి బొందివాగు కలిసే చోట ప్రస్తుతమున్న రెండు గేట్ల స్థానంలో 20 వేల క్యూసెక్కుల వరదను తట్టుకునేలా ఇంజినీర్లు, అధికారులు డిజైన్‌ను రూపొందిస్తున్నారు. ప్రస్తుత నిర్మాణం కేవలం 1,000-1,500 క్యూసెక్కుల వరదను మాత్రమే తట్టుకుంటుంది. కాళేశ్వరంలోని మేడిగడ్డ బ్యారేజీలో పియర్స్ కుంగుబాటు నేపథ్యంలో బొందివాగు ఇన్‌ఫ్లో గేట్ల నిర్మాణంపై అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు భావిస్తున్నారు.

**'నిట్' బృందం అధ్యయనం**

భద్రకాళి చెరువుకు బొందివాగు వరద కలిసే ప్రాంతంలో మృత్తిక నమూనాలను సేకరించి పూర్తిస్థాయి విశ్లేషణతో కూడిన నివేదికను ఇవ్వాల్సిందిగా నీటిపారుదల శాఖ అధికారులు వరంగల్ 'నిట్' ఇంజనీరింగ్ బృందాన్ని అభ్యర్థించారు. దాంతో ఆ దిశగా 'నిట్' బృందం దీనిపై లోతుగా అధ్యయనం చేస్తుంది. వారిచ్చే నివేదిక ఆధారంగా బొందివాగు ఇన్‌ఫ్లో గేట్ల నిర్మాణం, డిజైనింగ్ ఉండనున్నాయి. దాంతో ఈ పనుల్లో మరింత జాప్యం జరగనుంది. కాపువాడ నుంచి అలంకార్ బ్రిడ్జి వరకు నాలాకు రిటైనింగ్ వాల్ నిర్మించే విషయంలో సమీప ప్రాంతంలో పలువురి భూములు ఈ నిర్మాణంలో పోతున్నాయి. వారంతా నష్టపరిహారం కోసం కోర్టును ఆశ్రయించారు. నష్టపరిహారం ఇచ్చేలా అధికారులకు ఆదేశాలివ్వాలని నిర్వాసితులు కోర్టును కోరారు.

**గడువు పూర్తయినా పూర్తికాని పనులు**

భద్రకాళి చెరువు వరద నియంత్రణ పనులకు సంబంధించి 2024 జులైలో అగ్రిమెంట్ జరిగింది. ఏడాదిలో అంటే 2025 జులైలో ఈ పనులు పూర్తి కావాల్సి ఉంది. ఇందులో భద్రకాళి పూడికతీత, మత్తడుల నిర్మాణం, బొందివాగు కలిసేచోట ఇన్‌ఫ్లో గేట్లు, మత్తడుల వద్ద గేట్ల నిర్మాణం, బొందివాగు ఎగువన రైల్వే ట్రాక్ నుంచి భద్రి వరకు, కాపువాడ మత్తడి నుంచి అలంకార్ జంక్షన్ బ్రిడ్జి వరకు రెండు వైపులా రిటైనింగ్ వాల్‌ను నిర్మించాల్సి ఉంది. అయితే, కాపువాడ మత్తడి కాంక్రీట్ పనులు మాత్రమే సుమారు 60-70 శాతం పూర్తయ్యాయి. చివరకి పూడికతీత పనులు సైతం పూర్తి కాలేదు. పూడికతీత పనులు మే నెలలో పూర్తవుతాయని ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించినా పూర్తి కాలేదు. వర్షాలు వరుసగా కురుస్తుండటంతో పనులు నిలిచిపోయాయి.

## మల్లారెడ్డి ఇంట్లో ఐటి సోదాలేం జరగలేదు

ప్రీతిరెడ్డి ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన కుమారుడు భద్రారెడ్డి ఇండ్లల్లో ఐటీ అధికారుల సోదాలు అంటూ వచ్చిన వార్తలను మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వైస్ చైర్‌పర్సన్, మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి ఖండించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2022లో కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ పిజి సీట్ల విషయంలో తమ కళాశాలపై వేసిన కేసు విచారణలో భాగంగా వరంగల్ పోలీసులు వచ్చి నోటీస్ ఇచ్చారని తెలిపారు. ఉదయం ఆరు గంటలకు పోలీసులు రావడంతో ఐటీ అధికారులు వచ్చినట్టు ప్రచారం జరిగిందన్నారు. కానీ అది అవాస్తవమన్నారు. తమ యూనివర్సిటీలో అడ్మిషన్స్ అన్నీ సక్రమంగా జరిగాయని, అవకతవకలు జరగకుండా చూడటంలో మల్లారెడ్డి యూనివర్సిటీ జాగ్రత్తలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

## 26న ఉద్యోగ జెఎసి సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల సాధన కోసం శనివారం తెలంగాణ ఉద్యోగ జెఎసి సమావేశం కానుంది. ఈ మేరకు జెఎసి చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. ఇప్పటికే 17 నెలలు వేచిచూశామనీ, ఫలితం లేకపోవడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని వివరించారు. పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.తొమ్మిది వేల కోట్ల వివిధ రకాల బిల్లులను యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు కరువు భత్యాల (డిఎ)ను వెంటనే విడుదల చేయాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఒపిఎస్)ను అమలు చేయాలని సూచించారు. పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని 51 శాం ఫిట్‌మెంట్‌ను అమలు చేయాలని తెలిపారు. వివిధ కారణాలతో సస్పెండ్ అయిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని పేర్కొన్నారు. గచ్చిబౌలి స్థలాలను భాగ్యనగర్ టిఎన్‌జిఒలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానికత ప్రాతిపదికన అదనపు పోస్టులను సృష్టించి 317 జిఒ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పదోన్నతుల కమిటీలను సకాలంలో ఏర్పాటు చేసి పదోన్నతులను ఇవ్వాలని తెలిపారు.

యూరియా కోసం క్యూలో పెట్టిన బండరాళ్లు

## యూరియా కోసం బారులు

- క్యూలో బండరాళ్లు పెట్టిన రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని పచ్చల నడ్కుడ సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. గురువారం ఉదయమే క్యూలైన్‌లో పాసుబుక్కులు పెట్టిన రైతులు వర్షాలతో రాళ్లను పెట్టి నిరీక్షించారు. యూరియా కొరత లేకుండా సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అది కనబడటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతులు వరి, మొక్కజొన్న పంటలను ఎక్కువ మొత్తంలో సాగుచేశారు. యూరియా అవసరం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రైతులు బారులు తీరుతున్నారు. యూరియా బస్తాలు తక్కువగా ఉండటంతో రైతులంతా ఒకే మాటపై ఉంటూ ఒక్కొక్కరు రెండు బస్తాల చొప్పున యూరియా తీసుకోవడానికి ఒప్పుకోవడంతో గొడవకు దారితీసే క్రమంలో సద్దుమణిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు సరిపడా యూరియాను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

రాసారోకో చేస్తున్న విద్యార్థులు

## ఉపాధ్యాయుని కోసం రాస్తారోకో చేసిన విద్యార్థులు

- సంగారెడ్డి జిల్లా నాగర్‌గిద్ద మండలం ముక్టపూర్‌లో ఘటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయుని కోసం విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి, రాస్తారోకో చేసిన సంఘటన సంగారెడ్డి జిల్లా నాగల్ గిద్ద మండలం ముక్టపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌ను ఇటీవల డిప్యూటేషన్‌పై ఇరకపల్లి పాఠశాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో ఉపాధ్యాయుడు రమేష్ బదిలీపై వేరే చోటుకు వెళ్లతున్నట్టు తెలుసుకున్న విద్యార్థులు.. ఆయనను తమ పాఠశాలలోనే ఉంచాలని, ఆయనతో పాఠాలు బోధింపజేయాలని కోరుతూ.. ముక్టపూర్ చౌరస్తా రోడ్డుపై విద్యార్థులు బైటాయించి, రాస్తారోకో నిర్వహించారు. "మా సారు మాకే కావాలి, ప్రభుత్వం వెంటనే బదిలీ రద్దు చేయాలి" అనే నినాదాలతో గంట సేపు ఆందోళన నిర్వహించారు. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు రమేష్ ఇరకపల్లి పాఠశాలకు వెళుతుండగా మార్గమధ్యలో విద్యార్థులు అడ్డుకొని కంటతడి పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, యువకులు పాల్గొన్నారు.

## భయపడకండి.. అండగా నేనున్నా !

- నల్ల బాలుకు కెటిఆర్ భరోసా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులకు భయపడొద్దని, ప్రతి ఒక్కరికి తనతో పాటు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్) భరోసా ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న ఆరోపణలపై అరెస్టయ్యి బెయిల్‌పై తిరిగి వచ్చిన నల్ల బాలు (శశిధర్ గౌడ్)ను సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపాలిటీ పోచారం గ్రామంలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కో ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, నాయకులతో కలిసి కెటిఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా శశిధర్ గౌడ్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అక్కడే కెటిఆర్ కేక్ కట్ చేసి తన జన్మదిన వేడుకను చేసుకున్నారు. శశిధర్ గౌడ్ పిల్లలకు బహుమతులు అందించారు. వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలపై కార్యకర్తలు ఇంకా గట్టిగా నిలదీయాలని సూచించారు. తప్పుడు కేసులకు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కాగా, మాజీ మంత్రి కెటిఆర్ ఆయన ఇంటికి వచ్చి పరామర్శించి భోజనం చేయడంతో ఎంతో భరోసానిచ్చినట్టు అయిందని బీఆర్ఎస్ శ్రేణులు చర్చించుకుంటున్నారు. కెటిఆర్ వెంట కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, మాజీ కార్పొరేషన్ చైర్మెన్ బిక్షపతి, కార్పొరేటర్లు వి.సింధు ఆదర్శ్ రెడ్డి, మెట్టు కుమార్, మాజీ జెడ్పీటీసీలు శ్రీకాంత్ గౌడ్, బాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, వెంకటేష్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విమలా రణదివే పోరాట ధీశాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి విమలా రణదివే అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కొనియాడారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో విమలా రణదివే 26వ వర్ధంతిని నిర్వహించారు.

ఆమె చిత్రపటానికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్‌వి రమ పూలమాల వేసి నివాళులు అర్పించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్, ఆఫీస్‌బేరర్లు పుష్పగుచ్ఛాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. ఒక సందర్భంలో తెలిసీతెలియన స్వాతంత్రోద్యమ పోరాటంలో పాల్గొనానని చెబితే వదిలిపెడతామని పోలీసులు సూచించగా.. ఆమె ధైర్యంగా నిరాకరించారని కొనియాడారు. మహారాష్ట్రలోని మధ్యతరగతి కుటుంబంలో పుట్టి కార్మిక వర్గ విముక్తి కోసం పనిచేశారని, అనేక యూనియన్లకు నాయకత్వం వహించారని గుర్తుచేశారు. దేశ వ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించారన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వ్యవస్థాక సభ్యులుగా, శ్రామిక మహిళ సమన్వయ కమిటీకి వ్యవస్థాపక జాతీయ కన్వీనర్‌గా, అంగన్‌వాడీ యూనియన్‌కు వ్యవస్థాపక అధ్యక్షులుగా పనిచేశారని చెప్పారు. నేడు దేశవ్యాప్తంగా కార్మిక వర్గంపైనా, మహిళలపైనా జరుగుతున్న దాడులను తిప్పికొట్టడమే ఆమె ఇచ్చే నిజమైన నివాళి అని చెప్పారు.

## 'క్విట్ కార్పొరేట్'ను జయప్రదం చేయండి

- ట్రంప్ షరతులకు తలొగ్గిన మోడీ..
- దేశంలోకి అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతికి యత్నం : బి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్పొరేట్ వ్యవస్థకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆగస్టులో నిర్వహించనున్న క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశానికి హాజరైన ఆయన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకొచ్చి.. సంపదను వారికి దోచి పెట్టే విధంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సంపదను దోచుకుంటున్న కార్పొరేట్లను తరిమికొట్టి వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడంతోపాటు గ్రామీణ పేదలను రక్షించుకుందామని పిలుపునిచ్చారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ పెట్టిన షరతులకు తలొగ్గి.. ఆ దేశ వ్యవసాయ ఉత్పత్తులను మన దేశంలోకి ప్రవేశపెట్టడానికి ప్రధాని మోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు దేశంలోకి వస్తే ఇక్కడి రైతులు పండించే గోధుమలు, మొక్కజొన్న, ఇతర ఉత్పత్తుల కొనుగోళ్లు దెబ్బతింటాయని, మన ఆహార భద్రతకే ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందని అన్నారు. మరోపక్క ఆహార భద్రతలో భాగంగా ఇకపై సరుకులు ఇవ్వకుండా నగదు బదిలీ చేయాలని చూస్తున్నారని చెప్పారు. అంబానీ, ఆదాని ఆస్తులను మరింత పెంచడానికి మోడీ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ శక్తులు వస్తే తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో వ్యకాస రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, వెంకట్రాములు, రాష్ట్ర ఆఫీస్ బెరర్స్ బుర్రి ప్రసాద్, బొప్పని పద్మ, నారి ఐలయ్య, పొన్నం వెంకటేశ్వరావు, కొండమడుగు నరసింహ తదితరులు పాల్గొన్నారు.